# చేజారిన స్వర్గం

ఎనిమిదింటికి సికింద్రాబాద్ స్టేషన్ చేరుకోవాల్సిన ఎ.పి. ఎక్స్‌ప్రెస్ ఒక గంట ఆలస్యంగా సికింద్రాబాద్ సమీపిస్తోంది.

సుకుమార్ తన సూట్‌కేసు, హోల్డాలు అన్నీ సర్దుకుని ట్రెయిన్ ఫ్లాట్ మీద ఆగిన మరుక్షణంలో దిగిపోవడానికి రెడీగా ఉన్నాడు. హైదరాబాద్‌ను సమీపిస్తున్న కొద్దీ సుకుమార్‌లో అసహనం పెరిగిపోసాగింది. రామగుండం దాటాక ట్రెయిన్ సిగ్నల్ ఇవ్వకపోవడం చేతనో, మరే కారణం చేతనో ఆగిపోతే అతనికి విపరీతమైన విసుగు, బాధ కల్గాయి. అతనికి అనుక్షణం అనన్య గుర్తుకు రాసాగింది. ఇంట్లో ఒక్కత్తే కూర్చుని అనుక్షణం తన కోసం ఎదురుచూస్తూ ఉంటుంది. ఈపాటికి స్టేషన్‌కు ఎన్నోసార్లు ఫోన్ చేసి ఉంటుంది. ట్రెయినొక గంట లేటని చెప్పి వుంటారు. నిప్పులమీద కూర్చొని వెయిట్ చేస్తున్నట్టుగా ట్రెయిన్ కోసం ఎదురు చూస్తూ ఉంటుంది. ఈ పాటికి స్టేషన్‌కు కూడా వచ్చే ఉంటుంది.

అనన్యతో పెళ్ళయి నెలరోజులు కూడా తిరక్కుండానే తనకీ ఢిల్లీ ప్రయాణం పడింది.

తను మేనేజర్‌గా పనిచేస్తున్న కంపెనీ వాళ్ళ హెడ్డాఫీసు ఢిల్లీలో ఉంది. సేల్స్‌ను ఇంప్రూవ్ చెయ్యడానికి తీసుకోవాల్సిన చర్యల్ని గూర్చి మాట్లాడటానికి ఢిల్లీ రావాలని అక్కడొక నాల్గు రోజులుండాలని తనకు ఎం.డి. ఫోన్ చేశాడు. ఏ కారణం చెప్పినా ఈ ట్రిప్ వాయిదా పడదని తెలుసు. అందుకే అనన్యను వదిలేసి వెళ్ళిపోతున్నానని ఎంతో దిగులు పడిపోతూ అతడు ఢిల్లీ బయల్దేరాడు. అలా ఢిల్లీలో నాల్గురోజులుండాల్సి వచ్చింది.

ప్రతిరోజూ హెడ్డాఫీసులో మీటింగ్... గత పదేళ్ళుగా కంపెనీ సాధించిన ప్రగతి... సేల్స్‌ను తెలియజేసే చార్టులు... లెక్కలు... ఇంకా ఇంప్రూవ్ చెయ్యడానికి తీసుకోవాల్సిన చర్యలు... ఇన్‌సెంటీవ్స్... యాడ్స్... ఇలా ఎన్నో విషయాలమీద చర్చలు... సూచనలు... బుర్రంతా వీటితోటే నిండిపోయింది.

సాయంత్రం హోటల్‌కు రాగానే తనకు అనన్య గుర్తుకొచ్చింది. ఈ మీటింగ్స్ ఎప్పుడయిపోతాయా... ఎప్పుడు వెళ్ళి హైదరాబాద్‌లో వాలిపోతానా అన్న ఆతురతే... ప్రతీ క్షణాన్ని, ప్రతీ గంటను లెక్కపెట్టుకుంటూ గడిపాడు... అనన్య జ్ఞాపకాలు అతన్ని నిద్రపోనిచ్చేవి కావు.

పెళ్ళయ్యాక అనన్యతో పట్టుమని పదిరోజులు కూడా గడపలేదు. ఆమె కరీంనగర్‌లో... తను హైదరాబాద్‌లో... మధ్యలో సెలవులొచ్చినప్పుడు మాత్రమే తను వెళ్ళొచ్చేవాడు. ఈ మధ్యనే తనకు మామగారు హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఓ మంచి ఇల్లు కొనిపెట్టాడు. తను ఢిల్లీ వచ్చేముందే ఆ ఇంట్లో ప్రవేశించారు. ఇల్లంతా సర్దుకొని సెటిలయ్యారో లేదో తనకీ ఢిల్లీ ప్రయాణం.

అనన్యను తనింకా పూర్తిగా తెలుసుకోనేలేదు.

పెళ్ళయిపోగానే ఓ పదిరోజులు ఊటీకి హనీమూన్‌కు వెళ్దామనుకున్నారు. తనకే సెలవు దొరకక ఆ ప్రయాణం వాయిదా పడింది. తన పెళ్ళి సడెన్‌గా ఫిక్స్ కావడం వల్ల ముందే అన్నీ ప్లాన్ చేసుకోలేకపోయారు.

అనన్య... మై డార్లింగ్! ఈపాటికి తనకోసం స్టేషన్లో వెయిట్ చేస్తూ ఉంటుందా? తను ఢిల్లీ నుండి బయల్దేరే ముందు తన ఫ్రెండ్ రవికాంత్ అన్న మాటలు గుర్తొచ్చాయి. రవికాంత్ తన చిన్నప్పటి ఫ్రెండ్... ఢిల్లీలో జాబ్ చేస్తున్నాడు. తనను సెండాఫ్ చెయ్యడానికి స్టేషన్‌కొచ్చాడు. ఒకరోజు తను వాళ్ళింటికి భోజనానికి వెళ్ళాడు. రవికూడా ఈ మధ్యనే పెళ్ళి చేసుకున్నాడు. వాళ్ళిద్దర్నీ చూస్తోంటే తనకెంత ముచ్చట వేసిందో... అనుక్షణం ఒకరి మీదొకరు జోక్స్ వేసుకుంటూ, నవ్వుకుంటూ, అల్లరి చేస్తూ ఎంత అన్యోన్యంగా ఉంటారో...

"కొత్తగా పెళ్ళి చేసుకొని భార్యను వదిలేసి ఢిల్లీకొచ్చిన వెర్రిబాగులవాడిని నిన్నే చూశాన్రా... నేనైతే పెళ్ళయిన ఆరు నెలలదాకా నా శ్రీమతిని ఒక్కక్షణం కూడా విడిచిపెట్టి ఉండలేదు" అన్నాడు రవికాంత్.

"ఏం చెయ్యమంటావురా? ఎం.డి. రమ్మన్నప్పుడు రాకపోతే ఉద్యోగం పోతుందిగా..."

"పోనీయ్... ఇదిపోతే మరొకటి... బీ.ఇ. చేసి ఎం.బి.ఎ. చేశావు. నిన్నెవ్వడన్నా సరే కళ్ళకద్దుకుని తీసుకుంటారు..."

"ఏమోరా! వెంటనే ఇంకొక ఉద్యోగం దొరుకుతుందన్న నమ్మకమేమిటి? ఎ బర్డ్ ఇన్ ది హాండ్ ఈజ్ వర్త్ టూ ఇన్ ది బుష్... అన్నారు"

"ఇంత కాలిక్యులేటెడ్‌గా వుంటే జీవితాన్ని ఎంజాయ్ చెయ్యలేవురా? పోనీయ్, నీతోబాటు నీ బెటర్‌హాఫ్‌ను కూడా ఢిల్లీ తీసుకురావాల్సింది"

"నాకా ఐడియానే రాలేదు.... వస్తానని తనూ అన్లేదు... నేనూ వస్తానని పట్టుబడితే తీసుకొచ్చేవాడినేమో"

"అదే మన మగవాళ్ళం చేసే పొరపాటు. ఆడవాళ్ళెప్పుడూ యేదీ నోరు తెరిచి ఇది కావాలని, ఇక్కడకు తీసుకుపోవాలనీ అడగరు... మనమే వాళ్ళ మనస్సులో యేముందో కనిపెట్టి వాళ్ళ కోరికల్ని తీర్చాలి"

"వాళ్ళుకూడా మన మనస్సుల్లో యేముందో తెలుసుకుని మన కోరికలు తీర్చాలిగా"

"అదేరా బ్రదర్ దాంపత్య జీవితంలోని హాయి! ఒకర్నొకరు తెలుసుకొని ఒకరి కోరికల్ని మరొకరు తీరుస్తూ ఆనందాన్ని జుర్రుకోవాలి... నువ్వేమో అంతటి ఆనందాన్ని వదిలేసి ఇలా ఒంటరిగా ఈ దిక్కుమాలిన ఢిల్లీకొచ్చావు... నువ్వు చిన్నప్పుడెలా వున్నావో ఇప్పుడూ అలాగే ఉన్నావు... ముద్దుపప్పు! మన టీచర్లందరూ నిన్ను 'ముద్దపప్పు' అంటుండేవాళ్ళు. కదలవూ మెదలవూ. అసలు నీకెప్పుడైనా కోపం, ఆవేశం వస్తాయా?" అన్నాడు రవి.

తను నవ్వాడు.

"నాకు కోపం వస్తుంది... ఆవేశమూ వస్తుంది... కానీ అవి బయటవాళ్ళమీద కాదు... నామీద నాకే కోపమొస్తుంటుంది..."

"నోనో... మనిషి అన్నాక కోపం రావాలి. ఆవేశం కల్గాలి - నవ్వాలి... ఎగరాలి. లైఫ్‌లోని అన్ని షేడ్స్‌ని ఎంజాయ్ చెయ్యాలి... నీ శ్రీమతైనా నిన్ను మారుస్తుందని ఆశిస్తాను. బీ హాపీ విత్ హర్... స్త్రీ ఇచ్చేంత సుఖం మనకి ప్రపంచంలో ఎవరూ ఇవ్వలేరు..." అన్నాడు రవి.

ట్రెయిన్ ఎక్కి కూర్చున్నాక రవికాంత్ గుడ్‌బై చెప్పి వెళ్ళిపోయాడు. ట్రెయిన్ కదలడంతో తను రవికాంత్ అన్న మాటల్ని గూర్చి ఆలోచించడం మొదలెట్టాడు.

నిజమే - స్త్రీ ఇచ్చేంత సుఖం మనకీ ప్రపంచంలో ఎవరూ ఇవ్వలేరు... కానీ స్త్రీలకు మాత్రం మగవాడివల్ల సుఖం కల్గదా? ఆ పర్టిక్యులర్ మూమెంట్‌లో పురుషుడే ఇనిషియేటివ్ తీసుకుంటాడెందుకు? స్త్రీ ఒక్కసారైనా పురుషుడితో నాకీ క్షణంలో మీతో కలవాలని ఉంది అని చెప్పదెందుకు? అనన్య ఎప్పుడైనా తనకై తాను తనతో పెనవేసుకునిపోయి "కమాన్ డియర్! లెటజ్ మేక్ లవ్!" అని అడిగిందా? ఎప్పుడూ తనే ఆమెను అప్రోచ్ కావాలి... ఆమె "ఇప్పుడొద్దు... కొంచెం ఆగండి" అంటుంది. తను మళ్ళీ అడగాలి. బతిమిలాడాలి. ప్రాధేయపడాలి... కొన్నిసార్లు బలవంతం చెయ్యాలి. చివరకు చాలా అయిష్టంగా తనకోసమేదో త్యాగం చేస్తున్నట్టుగా ఒప్పుకుంటుంది. ఆ కాస్సేపు కళ్ళు మూసుకుని ఓ బలిపశువులా పడుకుంటుంది

తప్ప తను కూడా ఆ కార్యంలో పాలుపంచుకోదు... ఎంజాయ్ చెయ్యదు. అందరు ఆడవాళ్ళూ ఇలాగే ప్రవర్తిస్తారా? అనన్య ఒక్కతే ఇలా చేస్తుందా?

అనన్య తనకు మొదటి చూపులోనే నచ్చింది.

ఆమెను చూడగానే నా జీవిత భాగస్వామిని ఈమే అనుకున్నాడు. అనన్య అందంగా ఉంది. ఆకర్షణీయంగా ఉంది. చలాకీగా మాట్లాడింది. బాగా చదువుకుంది. ఆమెను చూస్తే ఎదుటివాళ్ళను అర్థం చేసుకొనే తెలివితేటలూ, సంస్కారం ఉన్నాయనిపించింది. వాళ్ళ ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్ కూడా బావుంది. వాళ్ళనాన్న సూపరింటెండింగ్ ఇంజనీర్‌గా చేసి రిటైర్ అయ్యాడు. ఆయనకు ఒక్కతే కూతురు. ఇద్దరు కొడుకులు - ఒకరు డాక్టర్, ఇంకొకరు బిజినెస్ ఎగ్జిక్యూటివ్‌గా అమెరికాలో సెటిలైపోయారు. ఈ సంబంధం చేసుకుంటే మనకు కూడా స్టేట్స్ వెళ్ళే ఛాన్స్ రావొచ్చుననిపించింది.

అనన్య అంటే ఆ ఫ్యామిలీలో అందరికీ ఇష్టమే. ఎంతో సున్నితంగా, ఎంతో గారాబంగా పెరిగింది.

అన్ని విధాల ఈ సంబంధం బావుంటుందని అమ్మానాన్న అన్నారు. తనూ వెంటనే ఇంత కట్నమివ్వాలన్న కండీషన్ యేమీ లేకుండానే పెళ్ళికి ఒప్పేసుకున్నాడు.

ట్రెయిన్ సికింద్రాబాద్ స్టేషన్‌లో ఆగింది.

సుకుమార్ ట్రెయిన్ దిగగానే వాళ్ళ డ్రైవర్ పాషా తనవైపు పరిగెత్తుకుని రావటం కనిపించింది.

తన చేతిలో ఉన్న సూట్‌కేసు, హోల్డాల్ డ్రైవర్‌కిచ్చేసి "నువ్వొక్కడివే వచ్చావా?"

"జౌనుసార్" అన్నాడు పాషా.

"ఇంకెవరూ రాలేదా?"

"రాలేదు సార్" అన్నాడు పాషా.

అనన్య వస్తుందనుకున్నాడు. తను ఢిల్లీ నుండి ఫోన్‌చేసి ఈ రోజు ఏ.పి.లో వస్తున్నానని, ఏ.పి. ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్ చేరే టైముకు నువ్వు స్టేషన్లో వుండాలని చెప్పాడు. తను కూడా "తప్పకుండా వస్తాను డార్లింగ్... నీకోసం క్షణమొక యుగంగా ఎదురు చూస్తున్నాను. ఫ్లైట్‌లో రాకూడదూ?" అంది.

కానీ ఆమె రాలేదు. డిసప్పాయింటెడ్ మీ... బ్యాడ్లీ డిసప్పాయింటెడ్ మీ - స్టేషన్ బయటకొచ్చి కారెక్కాడు.

ఇంటికెళ్ళగానే అనన్యను తన కౌగిలిలో బంధించాలి. గట్టిగా, తన శక్తినంతా కూడదీసుకుని హృదయానికి హత్తుకోవాలి... ఎంతసేపటికీ ఆమెను తన కౌగిలిలోంచి

బయటపడనీయొద్దు. "స్టేషన్‌కొచ్చి నన్ను రిసీవ్ చేసుకోనందుకు నీకిదే శిక్ష" అని చెప్పాలి. ఈ వారం రోజుల దాహం, ఆకలిని, ఒంటరితనాన్ని, వేదనను ఆమె శరీరంతో ఐక్యమైపోతేగాని తీరదు.

అరగంట తర్వాత వాళ్ళ కారు బంజారాహిల్స్‌లోని వాళ్ళ ఇంటిముందు ఆగింది.

మెయిన్‌డోర్ దగ్గరే అనన్య తనకోసం ఎదురుచూస్తుందనుకున్నాడు. కానీ లేదు. కారు దిగి పోర్టికో కింద ఓ క్షణంసేపు నిల్చున్నాడు... యే క్షణంలోనైనా అనన్య పరిగెత్తుకొని వస్తుందనుకున్నాడు... కానీ ఆమె రాలేదు.

సుకుమార్ ఇంట్లో అడుగు పెట్టాడు. అసలు అనన్య ఆ ఇంట్లో ఉన్నట్టే లేదు.

సోఫాలో కూర్చొని షూస్ విప్పుకుంటోంటే లోపల్నించి వంటమనిషి సుజాత వచ్చి–

"అమ్మగారు బయటకెళ్ళారు. ఇప్పుడే, ఓ అరగంటలో వస్తామని చెప్పమన్నారు" అని చెప్పింది.

బయటకెళ్ళిందా? తను వారం రోజుల తర్వాత ఇంటికొస్తున్నానని తెలిసి కూడా బయటకెళ్ళిందా? యేమిటంట అర్జెంట్ పని? తనను చూడటం కంటే తన అలసటను పోగొట్టడం కంటే ముఖ్యమైన పనా? డ్యామిట్.

"స్నానం చెయ్యాలి. గీజర్ ఆన్ చేశావా?" అన్నాడు.

"చేస్తానండి..." అంది సుజాత.

సుకుమార్ బట్టలు విడిచేసి లుంగీ కట్టుకున్నాడు.

దిసీజ్ టూ మచ్! వారం రోజులుగా ఆమెనెప్పుడు చూస్తానా అని క్షణమొక యుగంగా ఎదురుచూస్తున్న భర్తనొదిలేసి... 28 గంటలు ప్రయాణం చేసి, పదిహేను వందల కిలోమీటర్ల దూరాన్ని దాటి అలసి సొలసి తన ఒడిలో ఎప్పుడు సేద తీర్చుకుందామా అని తపిస్తున్న తన భర్త కోసం తన పనిని వాయిదా వేసుకోలేదా? ఈ మనిషినే తను చూడగానే "ఈమే నా జీవిత భాగస్వామిని... నా బెటర్ హాఫ్... బ్రతికినంత కాలం తనతో కష్టాన్నీ, సుఖాన్నీ, కలల్నీ, కన్నీళ్ళనూ పంచుకుంటూ సహజీవనం చెయ్యబోతున్న అనురాగమూర్తి" అనుకున్నాడు.

అలా అని నిన్నెవరనుకోమన్నారు? నువ్వే అంతా ఊహించుకున్నావు. ఒక మనిషిని బాహ్యంగా మాత్రమే చూసి అతడుగానీ, ఆమెగానీ ఎలాంటిదో చెప్పడం ఎంత కష్టం? అందమైన రూపం వున్నవాళ్ళకు అందమైన హృదయం ఉండాలన్న గ్యారంటీ ఏముంది?

సుకుమార్ బాత్‌రూమ్‌కు వెళ్ళి స్నానం చెయ్యడం మొదలెట్టాడు. వేడినీళ్ళు వంటిమీద పోసుకుంటోంటే ప్రాణానికెంత హాయిగా ఉందో... పైగా ఇది జనవరి... బాగా చలిగా ఉంది. ఢిల్లీలో చలితో ఎంత బాధపడ్డాడో... పక్కనే అనన్య ఉంటే... అనన్యను గుండెలకు హత్తుకుని పడుకుంటే ఎంత వెచ్చగా ఉండేదోనని ఎన్నిసార్లను కున్నాడో... ఆ కోరిక ఈరోజైనా తీరుతుందా? అసలు అనన్య వస్తుందా? తనకు కనిపిస్తుందా? తన కల నిజమౌతుందా? కట్టుకున్న భార్యను కలుసుకోవడం కూడా కల నిజమవటమౌతుందా?

తలకు షాంపూ రాసుకున్నాడు. అనన్య తన తలకు షాంపూ రాసి తలరుద్ది వేడినీళ్ళు కుమ్మరిస్తుందనుకున్నాడు. సబ్బుతో వీపురుద్ది చక్కిలిగింతలు పెడ్తుందనుకున్నాడు.

అనన్య ఇలా ఎందుకు చేసింది? లేక వాళ్ళ నాన్నగారింటికెళ్ళిందా? అసలొస్తుందా? ఈ ఒంటరితనమనే చితినుండి తనను కాపాడుతుందా?

శరీరమంతా తుడుచుకుని, లుంగీ కట్టుకుని డ్రెస్సింగ్ టేబుల్ ముందు నిల్చున్నాడు. టవల్‌తో మరోసారి తలంతా తుడుచుకున్నాడు. శరీరమంతా పౌడర్ చల్లుకున్నాడు.

కాస్సేపు వెళ్ళి టీవీముందు కూర్చున్నాడు.

ఎన్ని ఛానెల్స్ మార్చినా అతనికి టీవీవైపు చూడాలనిపించలేదు. టీవీ ఆఫ్ చేశాడు. ఇప్పటికైనా అనన్య వస్తే ఎంత బావుండును. కొన్ని మేగజైన్స్ తిరిగేశాడు. అనన్య రాలేదు. నిద్రొచ్చినట్టుగా అనిపిస్తే పడుకున్నాడు. ట్రెయిన్లో అసలు నిద్ర రాలేదు. పడుకోగానే అతనికి నిద్ర పట్టేసింది. ఏవో కలలు. అనన్య వచ్చి తనమీద వాలిపోయినట్టుగా... తనామెను ముద్దులతో ముంచెత్తుతున్నట్టుగా... కాస్సేపట్లోనే అతనికి మెలకువ వచ్చింది. పక్కన అనన్య ఉందనుకున్నాడు. కానీ లేదు. టైమ్ చూశాడు.

రాత్రి పది దాటింది.

"వడ్డించమంటారా అయ్యగారు" అంది సుజాత.

"మీ అమ్మగారు ఇక రాదట్నా?" అన్నాడు.

"ఆలస్యమైతే అయ్యగారికి వడ్డించెయ్ అని చెప్పి వెళ్ళారండి" అంది సుజాత.

"ఓహో! వడ్డించమని కూడా చెప్పే వెళ్ళిందా? అయితే వడ్డించెయ్" అన్నాడు.

వారం రోజులుగా హోటల్ తిండి తింటూ ఆకలితో అలమటించిపోతున్న వాడికి స్వయంగా దగ్గరుండి కొసరి కొసరి వడ్డిద్దామన్న ధ్యాస లేదన్నమాట–

డైనింగ్ టేబుల్ మీదున్న అన్నం కూర కంచంలో వేసుకుని కలుపుకోసాగాడు.

ఇదేమిటి? తనకేమయిందిప్పుడు? గొంతు పూడుకుపోతున్నదేమిటి? గొంతులోకి ముద్ద దిగడం లేదేమిటి? గుండెలు బరువెక్కుతున్నాయెందుకు?

డిసీజ్ టూ మచ్! యూ ఆర్ బిహేవింగ్ లైక్ ఎ చైల్డ్... డోన్ట్ బికమ్ ఎ చైల్డ్...

లేదు... లేదు... తననెవరో ఘోరంగా మోసం చేశారు – లేకపోతే తనకిలాంటి భార్య దొరకడమేమిటి? నిన్నెవరూ మోసం చెయ్యలేదు – నిన్ను నువ్వే మోసం చేసుకున్నావు. మనిషిని చూడగానే కేవలం ఆమె అందాన్ని చూసి, ఆమె ఆస్తిని చూసి పెళ్ళి చేసుకోవాలని ఎందుకు నిర్ణయించుకున్నావు? ఆమెతో ఓ గంటసేపైనా మాట్లాడావా? ఆమెది ఎలాంటి మనస్తత్వమో... ఆమె లైక్స్ అండ్ డిజ్‌లైక్స్ ఏమిటో తెలుసుకున్నావా? ఆమె జీవిత దృక్పథమేమిటో, ఆమె విలువలేమిటో తెలుసుకున్నావా? ఆమెకు నీకూ సమన్వయం కుదురుతుందో లేదో పరిశీలించావా? ఆమె నాన్నకు బాగా డబ్బుంది – ఆమె అందంగా ఉంది – ఆమె బ్రదర్స్ స్టేట్స్‌లో ఉన్నారు – తనకూ స్టేట్స్ ఛాన్స్ తగుల్తుంది – ఇవేగా నువ్వు చూశావు. చాలా ఆకలిగా ఉంది. అయినా అన్నం సహించడం లేదు. అన్నంలోనే చేతులు కడిగేసి లేచాడు.

బెడ్‌రూమ్... ఎ.సి, బెడ్‌రూమ్. తన స్వర్గం. కానీ ఈ క్షణంలో నరకంలా ఉంది. ఇప్పటికైనా అనన్య వస్తే! ఈపాటికి తనూ అనన్య ఒకరితో ఒకరు ఐక్యమైపోతూ స్వర్గంలో ఉండాలి. కాని స్వర్గం చేజారిపోతోంది – పారడైజ్ లాస్ట్... పోయింది. స్వర్గం చేజారిపోయింది.

లేదు... లేదు... స్వర్గం చేజారిపోలేదు. అనన్య వస్తుంది. తనను లాలిస్తుంది. తనను పాలిస్తుంది... తన బాధనంతా క్షణంలో పోగొడుతుంది... ఆమె గుండెల మధ్య తలదూర్చి తను హాయిగా నిద్రపోతాడు.

బయట ఎవరో తలుపు కొట్టిన చప్పుడు.

తలుపు తీసే వుంది.

వస్తోంది... అనన్య వస్తోంది.... తను కాస్సేపు మాట్లాడకూడదు. నిద్ర నటించాలి.

తలుపు తోసుకుని అనన్య లోపలికొచ్చింది. తననింతటి హింసకు గురిచేసిన రాక్షసి వచ్చేసింది... తనకు స్వర్గం చూపించే దేవత వచ్చేసింది.

"హల్లో డార్లింగ్! ఎప్పుడొచ్చారు?"

ఆమె తన దగ్గరకొస్తోంది. ఆమె శిరోజాల నుండి... ఆమె శరీరం నుండి వెలువడ్తున్న అద్భుతమైన సువాసనలు అతన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఆమెను వెంటనే తన బాహువుల్లోకి తీసుకొని ఆమె శరీరాన్నంతా ముద్దులతో నింపెయ్యాలని

పిస్తోంది. తనను తాను కంట్రోల్ చేసుకోలేడు... యే క్షణంలోనైనా తన బెట్టు సడలుతుంది. ఆమెకు పూర్తిగా సరెండర్ అయిపోతాడు... నోనో... తననింత యేడిపించిన అమెను శిక్షించకుండా తను సరెండర్ కాకూడదు...

"కోపమొచ్చిందా డియర్..." అందామె అతని చెవిలో మూతి పెట్టి.

"లేదు – చాలా సంతోషం కలిగింది" అన్నాడతడు మరోవైపు తిరిగి.

"సారీ డియర్ – మీకన్నా ముందే వచ్చేద్దామనుకున్నాను. కాని పాడు ట్రెయిన్ కరెక్ట్‌గా టైమ్‌కే వచ్చినట్లుంది" అంది అనన్య.

"గంట లేటుగా వచ్చింది"

"గంట ఎందుకు... ఓ మూడు గంటలు లేటుగా రాకూడదూ... అంత దూరం నుండి వస్తోంది కదా..."

అతడేమీ మాట్లాడలేదు.

"ఇంకా కోపం పోలేదా డియర్! నీకోసమే... నువ్వు రాగానే అందంగా, అద్భుతంగా కనిపించాలని బ్యూటీ పార్లర్‌కి వెళ్లాను. ఓ అరగంటలో వచ్చేద్దామని వెడ్తే వాళ్ళు మూడు గంటలు చేశారు..."

"నువ్వెళ్ళింది బ్యూటీపార్లర్‌కా?" అతడు ఆశ్చర్యంగా కళ్ళు తెరిచి ఆమెకేసి చూశాడు. అలాగే కొన్ని క్షణాలు చూస్తూ ఉండిపోయాడు.

"ఏమిటలా చూస్తున్నారు? నా హేర్‌స్టైల్ బాగాలేదని నిన్ననే మద్రాసు నుండి వచ్చిన నా ఫ్రెండ్స్ అన్నారు... ఈ రోజు మీరొచ్చేలోగా హేర్‌స్టైల్ మార్చు కుందామని, మిమ్మల్ని సర్‌ప్రైజ్ చేద్దామని బ్యూటీపార్లర్ కెళ్ళాను..."

"నీ హేర్‌స్టైల్ బాగాలేదని ఎవరన్నారు"

"నా ఫ్రెండ్స్ అని చెప్పానుగా... వాళ్ళు నాకు కృష్ణ ఒబెరాయ్ హోటల్‌లో యాక్సిడెంటల్‌గా కలిసారు. వందన అండ్ చందన. వాళ్ళు నా చిన్నప్పటి ఫ్రెండ్స్. వాళ్ళ భర్తలేదో కాన్ఫరెన్స్‌కొస్తే వాళ్ళతో వీళ్ళూ వచ్చారు – నా హేర్‌స్టైల్ మిడిల్ ఏజ్డ్ ఉమన్ హేర్‌స్టైల్లా ఉందని వెక్కిరించారు. నువ్విలాగే ఉంటే నీ భర్త మరొకదాన్ని చూసుకుంటాడని ఆటపట్టించారు. వాళ్ళే ఈరోజు నన్ను బ్యూటీపార్లర్‌కు తీసికెళ్ళి పక్కనుండి నా హేర్‌స్టైల్ మార్పించారు... ఇప్పుడు నేను చాలా బావున్నాను కదూ డియర్! టీనేజర్లా మారిపోయాను కదూ డియర్!"

"టీనేజర్లా కాదు – అమ్మమ్మలా మారిపోయావు" కసిగా అన్నాడతడు.

"అదేమిటి డియర్, అంత కఠినంగా మాట్లాడతావు – నువ్వలా అంటే నాకు యేడుపొస్తుంది" అంటూనే ఆమె యేడ్వటం మొదలెట్టింది.

"నిన్నీ రూపంలో చూస్తోంటే నాకూ యేడుపొస్తోంది"

"ఎందుకు డియర్"

"నీ హేర్ ఎంత అద్భుతంగా ఉండేది? నీ భుజాలనిండా, నీ వీపునిండా వ్యాపించి... నల్లగా నిగనిగలాడ్తూ మత్తెక్కించే స్మెల్‌తో నన్ను వుక్కిరిబిక్కిరి చేసే నీ హేరంటే నాకెంత ఇష్టమో నీకు తెలీదా? ఐవాజ్ ప్రౌడాఫ్ యువర్ హేర్ – ఆడదానికి కురులే అందం... అంత అందమైన వెంట్రుకల్ని కట్ చేయించుకొని బాబ్డ్‌హేర్‌తో మగరాయుడిలా తయారైన నీ మొఖం చూస్తోంటే..."

"ఆడదానికి కురులే అందమని ఎవరన్నారు? మీ మగవాళ్ళన్నారు – అసలు మా అందాన్ని గూర్చి మాట్లాడటానికి మీరెవరు? మేం ఎలా ఉండాలో, ఎలా కనిపించాలో నిర్ణయించుకోవాల్సింది మేం. ఇది మా హేర్... మా ఇష్టం..."

"అసలు మీరు బ్యూటీ పార్లర్స్‌కు వెళ్తున్నదెందుకోసం? మీ అందచందాలన్నీ ఎవరి కోసం? మాకోసం కాదూ? మమ్మల్ని మీ అందంతో ఆకర్షించి, మత్తెక్కించి మమ్మల్ని సెక్సువల్‌గా రెచ్చగొట్టి మమ్మల్ని మీ గుప్పిట్లో పెట్టుకోవడానికి కాదూ?"

"కాదు... కానే కాదు... మా అందం మా కోసమే... మా ఆనందం కోసమే... మా తృప్తి కోసమే..."

"అబద్ధం... పచ్చి అబద్ధం..."

ఆమె వెంట్రుకల నిండా క్లిప్స్ ఉన్నాయి. ముఖం నిండా క్రీమ్ ఉంది. ఆమె బుగ్గలు ఆపిల్ పండులా నిగనిగలాడుతున్నాయి. ఆమెను చూస్తుంటే అతనిలో కోరిక విజృంభిస్తోంది.

కాస్సేపు ఇద్దరి మధ్యా నిశ్శబ్దం.

"భోజనం చేశారా?" అంది అనన్య.

"చెయ్యమని చెప్పే వెళ్లావటగా"

"28 గంటలు ప్రయాణం చేసి ఆకలితో వస్తారుగా... నేనొచ్చేదాకా ఆగలేరేమోనని..."

"థాంక్స్... నా మరో ఆకలిని గూర్చి ఆలోచించావా?"

"మరో ఆకలేమిటి?"

"చెబుతాను. త్వరగా డ్రెస్ మార్చుకుని... స్నానం చేసి ఆ క్రీములన్నీ కడుక్కొని వచ్చేయ్... నాకు ఓపిక లేదు"

"ఓ! మరో ఆకలంటే అదా?"

"ఔను... అదే... త్వరగా... తిన్నావా లేదా? స్నానం చేసి తినేసి వచ్చేయ్..."

"సారీ డియర్"

"ఎందుకు సారీ"

"మీ ఆ ఆకలిని నేనీరోజు తీర్చలేను"

"డోంటాక్ నాన్‌సెన్స్ – ఆకలి నాకే కాదు – నీకూ ఉండాలి. వారం రోజులుగా ఇద్దరమూ ఉపవాసమే ఉంటున్నాం. అదేదో నా ఒక్కడికే సంబంధించిన వ్యవహారమన్నట్లుగా మాట్లాడతావెందుకు?"

"నాకా ఆకలి లేదు – దయచేసి ఈరోజు నన్ను వదిలెయ్యండి – నా వెంట్రుకలకు అమర్చిన ఈ క్లిప్స్‌ను ఈరోజు రాత్రంతా వుంచుకోవాలని బ్యూటీషియన్ చెప్పింది – ఈ క్లిప్స్ కదిలితే కర్ల్స్ నేను కోరుకున్న విధంగా రావు – ఈరోజు నేనే వేరే గదిలో పడుకుంటాను"

"లెట్ యువర్ కర్ల్స్ గో టు హెల్... ఐ వాంట్యూ దిస్ నైట్... ఐ వాట్యూ ఎట్ ఎనీ కాస్ట్... ప్లీజ్ అండర్‌స్టాండ్ మై ఎగొనీ"

"ప్లీజ్ అండర్‌స్టాండ్ మై ప్రాబ్లెమ్... ఈరోజు కుదరదు... నాకిష్టం లేదు"

"రేపు కావాలంటే మరోసారి బ్యూటీషియన్ దగ్గరకు వెళ్దువుగానీ... ఈరోజు మాత్రం నన్ను కాదనొద్దు"

"నాకిష్టం లేదని చెప్పాను"

"యేనాడు నీకిష్టముందని ఈరోజుంటుంది. పోనీయ్ నా కోసం ఈ చిన్న త్యాగం చేశాననుకో..."

"ఇదివరకెన్నోసార్లు చేశాను – కానీ ఈరోజు చెయ్యలేను... ప్లీజ్ లీవ్ మీ ఎలోన్..." అంటూ ఆమె గదిలోంచి బయటకు వెళ్ళబోయింది.

"అనన్యా! నా సహనాన్ని పరీక్షించకు"

"మీరూ నా సహనాన్ని పరీక్షించకండి. ప్లీజ్ – కావాలంటే ఓ స్లీపింగ్ పిల్ వేసుకొని హాయిగా నిద్రపొండి"

ఆమె బయటకెళ్ళిపోయింది.

"డ్యామిట్!" అంటూ అతడు పెద్దగా అరిచాడు.

టీపాయ్ మీదున్న అలారం టైమ్‌పీస్ తీసి నేలకేసి కొట్టాడు – అది ముక్కముక్కలై పగిలిపోయింది. బెడ్ మీదున్న మెత్తలన్నీ విసిరేశాడు – డ్రెస్సింగ్ టేబుల్ మీదున్న పౌడర్స్‌నీ, సెంట్స్‌ని, క్రీమ్స్‌ని నాలుగువేపులా విసిరేశాడు.

లోపలేదో జరుగుతోందని గ్రహించిన అనన్య మళ్ళీ ఆ గదిలోకొచ్చింది.

"యేమిటీ అల్లరి... పసిపిల్లాడిలా... ఒక్కరోజు... నా కోసం ఆగలేరా? నాకోసం ఈ చిన్నత్యాగం చేయలేరా? అది నా అందం కంటే ముఖ్యమా? నాకంటే ముఖ్యమా?"

"ముఖ్యమే... అన్నింటికంటె ముఖ్యమే, ఒక్కరోజు కాదు... ఒక్క క్షణం కూడా ఆగలేను... ప్లీజ్... నాకోసం... నీ భర్తకోసం... నిన్ను చేసుకున్న భర్తకోసం నువ్వు నీ కర్ల్సుని త్యాగం చెయ్యాలి... ప్లీజ్...?

అతడామె దగ్గరకు రాబోయాడు.

"ప్లీజ్ వెయిట్! కంట్రోల్ యువర్‌సెల్ఫ్! నువ్వు నా భర్తవయినంత మాత్రాన నా అంగీకారం లేకుండా నన్ను తాకే హక్కు నీకులేదు..."

"డోంటాక్ షిట్! నీ హక్కుల సంగతి. నీ చట్టాల సంగతి నాకు తెలీదు... ఈ రాత్రి నువ్వు నాకు కావాలి... అంతే... నాకంతే తెలుసు..."

అతడామెకు ఇంకా దగ్గరగా వచ్చాడు.

"నన్ను బలవంతం చేస్తే పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయి. ఆడదంటే కేవలం మగవాడి సెక్స్ కోరికలు తీర్చే యంత్రం కాదు... సెక్స్ ఆబ్జెక్ట్ కాదు..."

"మిమ్మల్ని మీరే సెక్స్ ఆబ్జెక్ట్స్‌గా తయారుచేసుకుంటున్నారు. బ్యూటీ పార్లర్స్‌కు వెళ్ళి మీరు చేస్తున్నదేమిటి? సెక్స్ ఆబ్జెక్ట్స్‌గా తయారుకావడానికి కాదూ?"

"దానికి దీనికి యేమిటి సంబంధం?"

"బ్యూటీపార్లర్స్‌కు వెళ్ళి అందంగా, ఆకర్షణీయంగా కనిపించి మగవాడికి మత్తెక్కించి వాడిలో సెక్స్ కోరికల్ని రగిలించి వాడిని కుక్కలా మీ చుట్టూ తిప్పుకోవడానికి కదూ? ఆడదాన్ని సెక్స్ ఆబ్జెక్ట్స్‌గా చూసేది మగవాడు కాదు – ఆడదే తననో సెక్స్ ఆబ్జెక్ట్‌గా చూసుకొని అలా తనను తయారుచేసుకుంటోంది – తను మగవాడిని సెక్సువల్‌గా ఆకర్షించలేక పోయిన మరుక్షణం జీవచ్ఛవంలా మారిపోయాననుకుంటుంది.

ఇట్సెఎ ఫాక్ట్... ఆడవాళ్ళల్లో వున్న ఈ మనస్తత్వాన్ని కాష్ చేసుకోవడానికే ఈ దేశంలో బ్యూటీపార్లర్లు కుక్కగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి"

"అదంతా నాకు తెలీదు... నా వరకు మాత్రం అందంగా కనిపించడం నా తృప్తి కోసమే... మీకు మాత్రం మీరు అందంగా కనిపించాలని లేదూ! ఆడవాళ్లందరూ మీరంటే పడి చావాలని లేదూ?"

"లేదు. నేను నీలాగా యే బ్యూటీపార్లర్స్‌కు పరిగెత్తలేదు – ఆల్‌రైట్! ఆల్‌రైట్! లెటజ్ మేక్ పీస్... ఇప్పటికైనా ఆ బ్యూటీ కంపంతా తీసేసి వచ్చేయ్... లెటజ్ ఫర్‌గెట్

ఎవ్రీథింగ్! చేజారిపోతున్న స్వర్గాన్ని స్వంతం చేసుకుందాం... ప్లీజ్ కమాన్! లెటజ్ మేక్ లవ్ అండ్ బీ హాపీ"

"ఇంపాజిబుల్... ఈరోజు నేను మీ దగ్గరకు రాలేను... స్వర్గం ఎక్కడికీ పోదు... ఇరవై నాలుగ్గంటల్లో మీ స్వర్గం మీకందుతుంది..."

"ఇరవై నాల్గు గంటల్లో ఈ ప్రపంచం మునిగిపోతుంది. నువ్వా వుండవు – నేనూ ఉండను. రేపనేది లేదు... రాదు... ఇప్పుడు... ఈ క్షణం నిజం... ఇప్పుడు పోగొట్టుకున్న ఈ క్షణం మళ్ళీ రాదు... ప్లీజ్ అండర్‌స్టాండ్ మీ..."

"ప్లీజ్ అండర్‌స్టాండ్ మీ..."

"నన్నిలాగే హింసించి పిచ్చెక్కించావంటే పర్యవసానాలు చాలా తీవ్రంగా ఉంటాయి"

"అంటే... యేం చేస్తారు?"

"యేం చేస్తానో నాకే తెలియదు. ఐ మే ఈవెన్ రేప్ యూ"

"ఛీ ఛీ మిమ్మల్ని చూసి, మీ కామ్ అండ్ క్వైయట్ నేచర్ చూసి మీరెంతో సంస్కారవంతులనుకున్నాను. ఇంతగా దిగజారిపోతారనుకోలేదు..."

"నేను సంస్కారవంతుడ్ని కాను... నేనో రాక్షసుడిని. నేనో బ్రూట్‌ని... నేనో బీస్ట్‌ని... ఇలాంటి బ్రూట్‌తో నువ్వు కాపురం చేయొద్దు... ప్లీజ్ గెటవుట్! నా కళ్ళముందు ఇంకో క్షణం కూడా వుండొద్దు... ప్లీజ్ గెటవుట్ – ఈ ఇంట్లోంచే వెళ్ళిపోవాలి..."

"ఈ ఇంట్లోంచి వెళ్ళిపొమ్మనే హక్కు మీకెక్కడుంది. ఈ ఇల్లు, ఈ ఇంట్లో వున్న ప్రతి వస్తువు అన్నీ మా నాన్నగారు కొనిచ్చినవే..."

"ఆల్‌రైట్... ఆల్‌రైట్... అన్నీ మీ నాన్నగారిచ్చినవే... అవును... నిన్ను చేసుకొని నేను మీ నాన్నగార్కి, నీకు అమ్ముడుపోయాను – కాబట్టి నాకీ శిక్ష పడాల్సిందే... నీ అందాన్నీ, నీ ఆస్తినీ చూసి నిన్ను చేసుకోవడం నా జీవితంలో నేను చేసిన బిగ్గెస్ట్ బ్లండర్! ఇప్పటికైనా ఆ బ్లండర్‌ను సవరించుకుంటాను. నీ ఇంట్లోంచి నేనే వెళ్ళిపోతాను. నాకై నేను తగిలించుకున్న ఈ బానిసత్వపు సంకెళ్ళను నరికేసుకుంటాను. నేనే వెళ్ళిపోతానన్నాను. నా కళ్ళు తెరిపించినందుకు థాంక్యూ మై డియర్ ఫ్రెండ్... థాంక్యూ! నువ్విప్పుడిక నా భార్యవూ కావు – నేనూ నీ భర్తనూ కాను... గుడ్‌బై మై ఫ్రెండ్... గుడ్‌బై"

అతడు చకచకా తన బట్టల్ని సూట్‌కేస్‌లో సర్దుకొని వెళ్లిపోవడానికి సిద్ధమయ్యాడు.

"పొరపాటున నాదికాని వస్తువేదైనా పట్టుకుపోతే రేపు రెటర్న్ చేస్తాను" అంటూ అతడు సూట్‌కేస్ పట్టుకొని ఆ రూమ్‌లోంచి బయటికెళ్ళాడు.

"సారీ! మిమ్మల్ని అర్ధరాత్రి ఇలా బయటకెళ్ళమని చెప్పడం నా ఉద్దేశం కాదు... ప్లీజ్ వెళ్ళకండి..."

"నీ ఉద్దేశమేమిటో స్పష్టంగా తెలిసింది... అయినా నీమీద నాకిప్పుడు కోపం లేదు... ఎవరి స్థాయిలో వాళ్ళుండాలి... నాకన్న ఎక్కువ స్థాయిని అందుకోబోయి బోర్లాపడ్డాను. అంతా నేను చేసుకున్నదే... కాబట్టి నీమీద నాకు కోపం లేదు... నామీద నాకే కోపం... ఇదంతా నా స్వయంకృతాపరాధం"

"మీరు వెళ్ళిపోవద్దు ప్లీజ్... నామీదొట్టు... మీ కోరిక తీరుస్తాను... ఈ క్లిప్స్ తీసేస్తాను... మనస్ఫూర్తిగా అంగీకరిస్తున్నాను... ఆగిపొండి... ప్లీజ్..."

ఆమె కన్నుల్లోకి కన్నీళ్ళు ఉబికి వచ్చాయి.

అతడామె మాటల్ని వినిపించుకోలేదు. ఆమెవైపు తిరిగి చూడలేదు. "ఇట్స్ టూ లేట్" అని తనతో తాను చెప్పుకుంటున్నట్టుగా అన్నాడు.

"అతడు నిజంగా వెళ్ళిపోతాడా? లేదు... తిరిగొస్తాడు" అన్నట్టుగా అతన్నే చూస్తూ ఆమె అలాగే స్థాణువులా నిల్చుండిపోయింది.

అతడు బయటి ద్వారం దాకా వెళ్ళి తలుపు తెరచుకొని బయటకు వెళ్ళి మళ్ళీ ఆ తలుపుల్ని దభేలుమని మూసేసి చీకట్లో కలిసిపోయాడు.

'ఆంధ్రభూమి డైలీ' ఆదివారం అనుబంధం

*(23-3-1997 & 30-3-1997)*